క్లుప్తంగా

తెలంగాణ సాయుధ పోరాట యోధుడు మృతి

తుంగతుర్తి: తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, సీపీఎం నాయకుడు కామ మల్లయ్య (80) మృతి పార్టీకి తీరని లోటని సీపీఎం మండల కార్యదర్శి బుర్ర శ్రీనివాస్ అన్నారు. మండల పరిధిలోని కొత్తగూడెం గ్రామానికి చెందిన కామ మల్లయ్య గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ శనివారం మృతి చెందాడు. ఈ సందర్భంగా పలువురు నాయకులు ఆయన మృతదేహంపై పార్టీ జెండా కప్పి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో తాటి విజయమ్మ, మిట్టగడుపుల లచ్చయ్య, లింగయ్య, పేర్ల పాపయ్య పాల్గొన్నారు.

ప్రతిభ కనబరిచిన వారికి సన్మానం



సన్మానిస్తున్న ఫౌండేషన్ సభ్యులు

ఆత్మకూర్(ఎస్) : ఆత్మకూర్ గ్రామంలో వివిధ రంగాల్లో ప్రతిభ కనబర్చిన వారిని మేడి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నెమ్మికల్‌లో శనివారం ఘనంగా సన్మానించారు. గ్రూప్–1లో ఉత్తమ ర్యాంక్ సాధించిన ఆవుల సతీష్, మెడిసిన్‌లో సీటు సాధించిన విద్యార్థినులు యాతాకుల శ్రీజ, యాతాకుల అక్షర, కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా ఎంపికైన సోమిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికైన గిలకత్తుల యల్లాగౌడ్‌ను మేడి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎస్‌ఐ శ్రీకాంత్ గౌడ్ ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షుడు మేడి కృష్ణ, యాదగిరి, వెంకట్ రెడ్డి, మల్లేశ్, మల్సూర్, కృష్ణారెడ్డి, ఆవుల వెంకన్న, గుణగంటి వెంకన్న, అశోక్ యాతకుల వెంకన్న, బొడ్డు శ్రీను, పర్వతాలు, ఎల్లయ్య, బైరెడ్డి వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సూర్యక్షేత్రం సందర్శన



పూజలు చేస్తున్న విద్యార్థులు

అర్వపల్లి : నాగారం మండలం పస్తాలలోని పూలగడ్డ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు శనివారం తిమ్మాపురంలోని సూర్యక్షేత్రాన్ని సందర్శించారు. పీఎంశ్రీ పథకంలో భాగంగా సూర్యక్షేత్రాన్ని సందర్శించినట్లు ఉపాధ్యాయులు తెలిపారు. ఈ సందర్భంగా క్షేత్రంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నిర్వాహకులు క్షేత్ర విశిష్టతను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం డి.సునీత, ఉపాధ్యాయులు రాము, చక్రధర్, రాజశేఖర్, స్వామిగౌడ్, విద్యార్థులు పాల్గొన్నారు.

ధ్యానం అలవాటు చేసుకోవాలి



ధ్యానం చేస్తున్న విద్యార్థులు

నడిగూడెం : విద్యార్థి దశ నుంచే ధ్యానం చేయడం అలవాటు చేసుకోవాలని ధ్యాన నిపుణులు కొండా ఉపేందర్, మోతుక్కూరి శ్రీనివాస్ తెలిపారు. శనివారం నడిగూడెం మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల గురుకుల పాఠశాలలో ధ్యానంపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో వారు మాట్లాడారు. ధ్యానంతో ఏకాగ్రత పెరుగుతుందని, మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. జ్ఞాపక శక్తి కూడా పెరుగుతుందని తెలిపారు. ప్రతిరోజూ ధ్యానం చేయాలని సూచించారు. తద్వారా పాఠాలు కూడా సులభంగా అర్థమవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛతపై ప్రత్యేక దృష్టి



వట్టిఖమ్మంపహాడ్‌లోని మురుగు కాలువలో చెత్తా చెదారం తొలగిస్తున్న గ్రామ పంచాయతీ సిబ్బంది



వాల్యతండా వీధుల్లోని మురుగు గుంతల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లిస్తున్న పంచాయతీ కార్యదర్శి

- గ్రామాల్లో ప్రతిరోజూ డ్రెయినేజీలు శుభ్రం చేస్తున్న సిబ్బంది
- వ్యాధుల నివారణ దిశగా చర్యలు

చివ్వెంల : మండలంలో ఇటీవల విస్తారంగా వానలు కురవడంతో సీజనల్ వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని అధికారులు ముందస్తుగా ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపడుతున్నారు. అంతేకాకుండా అధికారులు తమ పరిధిలోని గ్రామాలను సందర్శించి ప్రజా సమస్యలు తెలుసుకుంటున్నారు. వాటి పరిష్కారానికి ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారు.

ప్రతి రెండు రోజులకు ఒకసారి..

చివ్వెంల మండలంలో మొత్తం 31 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. మొత్తం 33 వేల మంది జనాభా ఉన్నారు. అయితే ఆయా గ్రామ పంచాయతీల్లో పారిశుద్ధ్యంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. గ్రామాల్లో ప్రతి రెండు రోజులకు ఒకమారు మురుగుకాలువలు శుభ్రం చేయిస్తున్నారు. ఎక్కడ కూడా మురుగు నీరు నిలువకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. పెంటకుప్పల తొలగింపు, ప్రధాన రోడ్లకు ఇరువైపుల పెరిగిన పిచ్చి మొక్కల తొలగింపు వంటి పనులు చేయిస్తున్నారు. రోజూ ఉదయం ట్రాక్టర్ ద్వారా చెత్తను తరలిస్తున్నారు. మురుగు నీటిలో లార్వా నివారణకు థెమోపాస్ ద్రావణం వేస్తున్నారు.

రోజువారి కార్యక్రమాలు..

ఇప్పటికే మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో రోజువారి కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. మురుగు నీటిలో ఆయిల్‌బాల్స్ వేయడం, మురుగు నీరు నిలువకుండా చేయడం, పాతటైర్లలో, డబ్బాల్లో, డ్రమ్ముల్లో నిలువ ఉన్న నీటిని పారబోయడం, పాడుబడిన భవనాలు కూల్చడం, పాఠశాలల్లో పిచ్చిమొక్కలు తొలగించడం, దోమల మందు పిచికారీ చేయడం వంటి పనులు నిత్యం చేపడుతున్నారు. దీంతోపాటు వ్యాధుల నివారణ కోసం గ్రామీణులకు రోగాలపై అవగాహన కల్పిస్తున్నారు.

పారిశుద్ధ్యంపై శ్రద్ధ కనబరుస్తున్నం

మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాం. వర్షాకాలంలో వచ్చే వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని పంచాయతీ కార్యదర్శులకు తెలియజేశాం. చెత్తా చెదారం లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. పారిశుద్ధ్యం మెరుగుపరిచేందుకు ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నాం.

– సీహెచ్. సంతోష్ కుమార్, ఎంపీడీఓ

రోడ్లపైకి గోదావరి జలాలు



అర్వపల్లిలో రోడ్డుపై నుంచి ఇళ్లలోకి చేరుతున్న గోదావరి జలాలు

- 11ఆర్ మైనర్ కాలువ వద్ద అక్రమ తవ్వకాలతో వృథాగా పారుతున్న నీరు
- ఇళ్ల పరిసరాల్లోకి చేరుతుండడంతో ఇబ్బందులు పడుతున్న స్థానికులు
- నీటి వృథాను అరికట్టాలని అధికారులకు వినతి

అర్వపల్లి: అర్వపల్లిలోని ఉమామహేశ్వరస్వామి ఆలయానికి వెళ్లే రోడ్డులో గోదావరి జలాలు వృథాగా పోతూ ఇళ్లలోకి వస్తున్నాయి. ఈ రోడ్డు సమీపంలో 11ఆర్ మైనర్ కాలువ ఉంది. ఈ కాలువ వద్ద తవ్వకాలు జరపడంతో కాలువ నీరు వృథాగా పొలాల నుంచి రోడ్లపై పారుతూ ఇళ్లలోకి చేరుతోంది. దీంతో ఇళ్లు నీటిలో నాని దెబ్బతింటున్నాయి. అలాగే రోడ్డుపైకి వరద వస్తుండటంతో ఆ ప్రాంతంలో ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడు నీళ్లు నిలిచి దోమలు వృద్ధిచెందుతున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నీటి వృథాను అరికట్టాలని వినతి..

11ఆర్ మైనర్ కాలువ నుంచి గోదావరి జలాలు వృథాగా పోతూ ఇళ్లలోకి వస్తున్నాయని, ఈ నీటి వృథాను అరికట్టాలని స్థానికులు ఇప్పటికే అధికారులను కోరారు. స్థానిక నీటి పారుదల శాఖ ఈఈ, ఏఈ, తహసీల్దార్, ఎంపీడీఓలతో పాటు గ్రామ పంచాయతీలో ఫిర్యాదు చేశారు. ఇప్పటికైనా అధికారులు తగు చర్యలు తీసుకొని గోదావరి జలాలు ఇళ్లలోకి రాకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.

ఇళ్లు దెబ్బతింటున్నాయి



11ఆర్ మైనర్ కాలువ వద్ద అక్రమంగా తవ్వడంతో గోదావరి జలాలు అక్కడి నుంచి వరదలా తమ ఇళ్లలోకి వస్తున్నాయి. దీంతో ఇళ్లు నాని దెబ్బతింటున్నాయి. ఉమామహేశ్వరస్వామి ఆలయం రోడ్డు చెరువులా మారింది. నీళ్లు నిలిచి, దోమలు చేరి రోగాల పాలవుతున్నాం. ఈ విషయమై అన్నిశాఖల అధికారులకు ఫిర్యాదు చేశాం.

- పులిచర్ల కృష్ణమూర్తి, అర్వపల్లి

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



తుంగతుర్తి : మార్కెట్ కార్యాలయం వద్ద మాట్లాడుతున్న చైర్మన్ తీగల గిరిధర్‌రెడ్డి



తిరుమలగిరి : పరికరాలను పంపిణీ చేస్తున్న మార్కెట్ చైర్‌పర్సన్ ఎల్సోజు చామంతి

తుంగతుర్తి : రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని తుంగతుర్తి మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్‌రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో ఖరీఫ్ సీజన్‌కు సంబంధించిన ధాన్యం కొనుగోలు కేంద్రాలకు ఎంఎస్‌పీ పరికరాలను వైస్ చైర్మన్ చింతకుంట్ల వెంకన్నతో కలిసి పంపిణీ చేసి మాట్లాడారు. కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు ప్యాడీ క్లీనర్లు, మ్యాచర్ మిషన్లు, టార్పిలిన్లు తీసుకెళ్లాలని సూచించారు. రైతులు నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకెళ్లి ప్రభుత్వం అందించే మద్దతు ధర పొందాలని అన్నారు. అనంతరం ప్రధాని ప్రారంభిస్తున్న కొత్త పథకం కార్యక్రమాన్ని మార్కెట్ కమిటీ డైరెక్టర్లతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వీక్షించారు. రైతులకు అండగా ఉండేందుకు కేంద్ర ప్రభుత్వం ధన ధాన్య కృషి యోజనను తీసుకొచ్చిందని అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్లు పాక అమృతమల్లు, భూక్య మధునాయక్, బానోతు శ్రీను, సగం నర్సయ్య, వాసం వెంకన్న, కొమ్ము వెంకన్న, సిబ్బంది రమేష్, అఖిల్, లింగరాజు, ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

రైతులు మద్దతు ధర పొందాలి

తిరుమలగిరి : రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని అమ్మి మద్దతు ధర పొందాలని తిరుమలగిరి వ్యవసాయ మార్కెట్ చైర్‌పర్సన్ ఎల్సోజు చామంతి నరేష్ అన్నారు. శనివారం తిరుమలగిరి వ్యవసాయ మార్కెట్ యార్డులో ధాన్యం కొనుగోలు కేంద్రాలకు ఎంఎస్‌పీ పరికరాలను పంపిణీ చేశారు. అనంతరం ప్రధాన మంత్రి ధన్ ధాన్య వ్యవసాయ పథకం, పప్పు ధాన్యాల స్వావలంబన కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కార్యదర్శి సురేష్, సూపర్‌వైజర్ అనిల్‌కుమార్, డైరెక్టర్లు రాపాక సోమేష్, ఎండీ హఫీజ్, వేణురావు, ఉప్పలయ్య, రవీందర్, అంజయ్య పాల్గొన్నారు.

ఉద్యమకారుడికి పరామర్శ

అర్వపల్లి : కోడూరు గ్రామానికి చెందిన తెలంగాణ మలిదశ ఉద్యమకారుడు బొౖర వెంకన్న తండ్రి, పీఏసీఎస్ మాజీ వైస్‌చైర్మన్ బొౖర సైదులు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. దీంతో మాజీ జెడ్పీటీసీ దావుల వీరప్రసాద్‌యాదవ్ శనివారం మృతుడి కుటుంబీకులను పరామర్శించారు. సైదులు చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రవీందర్‌నాయక్, స్థానికులు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ బాలికల దినోత్సవం



తిరుమలగిరి : బాలికల దినోత్సవంలో పాల్గొన్న అధికారులు, విద్యార్థులు



నూతనకల్ : మాట్లాడుతున్న రవి కుమార్

తిరుమలగిరి : మండల కేంద్రంలోని కస్తూరిబాగాంధీ పాఠశాలలో శనివారం అంతర్జాతీయ బాలికల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ వెంకటేశ్వర్లు మాట్లాడారు. విద్యార్థులు ఉన్నత స్థాయిలో ఉండేలా భవిష్యత్తు ఆలోచనలు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుష్మిత, శోభారాణి, లింగయ్య, లక్ష్మయ్య పాల్గొన్నారు.

నూతనకల్ : సమాజంలో ప్రతి ఒక్కరూ బాలికల సాధికారత కోసం కృషి చేయాలని బాలల పరిరక్షణ జిల్లా అధికారి బి. రవికుమార్, జిల్లా బాలల సంక్షేమ సంస్థ సభ్యులు తండు నాగరాజు, రాంరెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని గుండ్లసింగారంలోని కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలలో మహిళా శిశు, వికలాంగుల, వయోవృద్ధుల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ బాలికల దినోత్సవం కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. బాలికలకు బాలురతో సమానంగా ప్రాముఖ్యత కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బాలల పరిరక్షణ విభాగం సిబ్బంది నాగరాజు, వీవీ లక్ష్మి, కిరణ్, కస్తూరిబా గాంధీ పాఠశాల ప్రత్యేక అధికారి తన్నీరు మాధవి, తదితరులు పాల్గొన్నారు.

బాలికల సాధికారతను పెంపొందించాలి

పెన్‌పహాడ్ : బాలికల సాధికారతను పెంపొందించాలని ఎస్‌ఐ గోపికృష్ణ అన్నారు. శనివారం అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలలో జస్ట్ రైట్స్ యాక్షన్ ఫర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్మెంట్ సంస్థ ఆధ్వర్యంలో బాలికలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బాలికలు విద్య, ఆరోగ్యం, భద్రత వంటి అంశాలపై దృష్టి సారించాలని అన్నారు. బాల్య వివాహాలు నేరమని, వాటిని నిర్మూలించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఓ ఆసియా జబిన్, సోమయ్య, అలీముద్దీన్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి దామోదర్ రెడ్డికి నివాళి



తుంగతుర్తిలో దామోదర్ రెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు



నివాళులర్పిస్తున్న అర్వపల్లి నాయకులు

అర్వపల్లి : మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డికి జాజిరెడ్డిగూడెం మండల కాంగ్రెస్ నాయకులు శనివారం తుంగతుర్తిలో నివాళులర్పించారు. అనంతరం సర్వోత్తంరెడ్డిని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకుడు సామ అభిషేక్‌రెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ బైరబోయిన సైదులు, మహరాజు, మాజీ దేవస్థాన చైర్మన్ చిల్లంచర్ల విద్యాసాగర్, బైరబోయిన రామలింగయ్య, గుయ్యని బాబు, కొప్పోజు వెంకన్న, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

నాగారం : మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డికి శనివారం నాగారం మండల కాంగ్రెస్ నాయకులు తుంగతుర్తిలోని ఆయన నివాసంలో నివాళులర్పించారు. కార్యక్రమంలో యలమకంటి సోమయ్య, కృష్ణమూర్తి, కొలిపాక సాయికుమార్, నాతి శ్రీనివాస్, తాడోజు అజయ్, తదితరులు పాల్గొన్నారు.

ఎల్లయ్య ఆశయ సాధనకు కృషి చేయాలి



స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

నాగారం : విప్లవోద్యమ నేత రింగు ఎల్లయ్య ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి గంట నాగయ్య అన్నారు. శనివారం డి.కొత్తపల్లిలో సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో రింగు ఎల్లయ్య ప్రథమ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్లయ్య స్థూపం వద్ద జెండాను ఆవిష్కరించి, ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు యానాల సుధాకర్ రెడ్డి, కునుకుంట్ల సైదులు, ఏఐకేఎంఎస్ డివిజన్ అధ్యక్షుడు సంపెట కాశయ్య, బయ్యం లింగయ్య, భరత్, ధనుంజయ్, సంపెట కృష్ణమూర్తి, కాశం వీరయ్య, శ్రీను, నాతి ఉప్పలయ్య, బడేమియా, వేముల గణేష్, విరాచారి, పల్లెర్ల సోమయ్య, మల్లేష్, లింగస్వామి, పవన్, భూషబోయిన రమేష్ పాల్గొన్నారు.

లింగయ్య మృతి తీరనిలోటు

పెన్‌పహాడ్ : ప్రజా కళాకారుడు, ఎర్రజెండా ముద్దుబిడ్డ వల్దాస్ లింగయ్య మృతి సీపీఎంకు తీరని లోటని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు రణపంగ కృష్ణ అన్నారు. శనివారం పెన్‌పహాడ్ మండల పరిధిలోని ధర్మాపురం గ్రామంలో లింగయ్య మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడారు. లింగయ్య చిన్నతనం నుంచే ఎర్రజెండా చేతబట్టి మండలంలోని వివిధ గ్రామాల్లో ప్రజానాట్య మండలి ఆధ్వర్యంలో ప్రజా ఉద్యమాలు నిర్వహించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ నెమ్మాది లక్ష్మి, పార్టీ నాగారం మండల కమిటీ సభ్యులు రణపంగ బుచ్చిరాములు, మోదుగు రవీందర్‌రెడ్డి, లింగయ్య సైదులు, రాధాకృష్ణ, వెంకయ్య, సోమయ్య, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

నిధులలేమితో అసంపూర్తి నిర్మాణాలు

- మూడేళ్లుగా కొనసాగుతున్న అంగన్‌వాడీ భవనాల పనులు
- త్వరగా పూర్తి చేయాలని స్థానికుల వేడుకోలు



రామన్నగూడెంలో అసంపూర్తిగా నిలిచిపోయిన అంగన్‌వాడీ భవన నిర్మాణం



కొమ్మాలలో..

అర్వపల్లి : అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాల నిర్మాణ పనులు నిధుల లేమితో కొన్నేళ్లుగా నత్తనడకన కొనసాగుతున్నాయి. జాజిరెడ్డిగూడెం మండలం రామన్నగూడెం, కొమ్మాలలో అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాల నిర్మాణం కోసం డీఎంఎఫ్ నుంచి మూడేళ్ల కిందట నిధులు మంజూరయ్యాయి. ఒక్కో భవనానికి రూ.9లక్షల చొప్పున మంజూరు చేశారు. దీంతో అప్పట్లోనే ఈ భవనాల నిర్మాణ పనులు మొదలయ్యాయి. కానీ ఇంకా పూర్తికాలేదు.

నిలిచిన పనులు..

కొమ్మాల, రామన్నగూడెం గ్రామాలలో చేపట్టిన అంగన్‌వాడీ కేంద్రాల భవనాల నిర్మాణాలు నిధులు చాలకపోవడంతో అసంపూర్తిగా నిలిచిపోయాయి. అదనపు నిధుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినప్పటికి నిధులు విడుదల కాలేదు. దీంతో పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. ప్రస్తుతం కనీస వసతులు కొరవడిన గదులలోనే అంగన్‌వాడీ కేంద్రాలను నడిపిస్తున్నారు. ఇప్పటికైనా అదనపు నిధులు మంజూరుచేసి భవనాల పనులు పూర్తిచేసి వినియోగంలోకి తేవాలని పలువురు కోరుతున్నారు.

అదనపు నిధులు కేటాయించాలి



మా గ్రామంలో కొన్నేళ్లుగా అంగన్‌వాడీ భవన నిర్మాణ పనులు జరుగుతున్నాయి. నిధుల లేమితో పనుల్లో జాప్యం జరుగుతోంది. ఆగిన పనులకు నిధులు మంజూరు చేయాలి. మిగిలిన పనులను త్వరగా పూర్తి చేసి భవనాన్ని వినియోగంలోకి తేవాలి.

- బుర్ర జనార్దన్, కొమ్మాల గ్రామస్తుడు

ఆలయంలో అన్నదానం

మునగాల : మునగాల మండలంలోని బరాఖత్‌గూడెం శివారులో గల స్వయంభూ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆలయ కమిటీ చైర్మన్ పాలిశెట్టి శ్రీనివాస్.. తన సొంత ఖర్చులతో శనివారం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆలయంలో ప్రతి శనివారం అన్నదానం చేస్తున్నామని, అన్నదాన వితరణకు దాతలు సహకరించి జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

నేడు వైద్యశిబిరం

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం సూర్యాపేటలోని హెల్త్‌పై ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు శనివారం తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గ్యారంటీల అమలులో విఫలం

తుంగతుర్తి : కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీల అమలులో ప్రజలను మోసం చేసిందని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తాటికొండ సీతయ్య ఆరోపించారు. శనివారం మండల పరిధిలోని బండరామారం గ్రామంలో పార్టీ శ్రేణులతో కలిసి ఇంటింటికీ కాంగ్రెస్ బాకీ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు ఆకారపు భాస్కర్, కొల్లూరి మహేందర్, పులుసు బక్కయ్య, ఉప్పుల వెంకన్న, చల్ల కృష్ణమూర్తి, మంజుల పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

చివ్వెంల : మండల కేంద్రానికి చెందిన సీపీఎం సీనియర్ నాయకుడు ఇట్టమళ్ల ఏసోబ్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. మృతుడి కుటుంబాన్ని శనివారం మాలమహానాడు నాయకులు పరామర్శించారు. అనంతరం మృతుడి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు తల్లమల్ల హస్సేన్, రాష్ట్ర కార్యదర్శి ఏడింఢ్ల అశోక్, రిటైర్డ్ తహసీల్దార్ రాజారావు తదితరులు పాల్గొన్నారు.

దళితుల సాగు భూములకు పట్టాలివ్వాలి

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండలం అడివెంల గ్రామ శివారులో దళితులు సాగుచేసుకుంటున్న భూములకు పట్టాలివ్వాలని ఏఐకేఎంఎస్ జిల్లా కార్యదర్శి బొడ్డు శంకర్ అధికారులకు విజ్ఞప్తి చేశారు. శనివారం రైతుకూలీ సంఘం ఆధ్వర్యంలో తిమ్మాపురం గ్రామ దళితుల భూములను పరిశీలించారు. అడివెంల గ్రామ శివారులో ఉన్న 335, 336, 338 సర్వే నంబర్లలోని ప్రభుత్వ భూములను గత 50 ఏళ్లుగా దళితులు సాగుచేసుకుంటూ జీవనం సాగిస్తున్నారని చెప్పారు. ఈ సమావేశంలో రైతులు పాల్గొన్నారు.